


# మరపురాని మమత

"అబ్బాయీ. మీ తండ్రి ఏం చేస్తారు?"

ఆ ప్రశ్నకు జవాబు ఆ అబ్బాయికి తెలుసు. అయితే తన స్వవిషయం గురించిన ప్రశ్న వస్తుందని అనుకోక పోవడం వల్ల తెల్లబోయాడు. ఇంటర్వ్యూ బోర్డువారు అతన్ని అడిగిన మొదటి ప్రశ్న అది.

ఆ అబ్బాయి కొంతసేపటికి తేరుకున్నాడు.

"ఆయన ఒక సన్యాసి. చాలాకాలం క్రిందటే ఐహిక విషయాలకు దూరమయాడు." మెల్లిగా జవాబు చెప్పాడతను.

ఆ అధికారులు అంతటితో ఊరుకోలేదు.

"మీకేమైనా ఆస్తి ఉందా?" అని అడిగారు.

"లేదండి."

"అయితే ఇంతవరకు నువ్వెలాగ చదువుకున్నావు?"

"ఈ ఊళ్లో ఉన్న ఒక ధర్మసంస్థ సహాయంతో చదువుకున్నానండి. ఆ సంస్థను చాలా కాలం క్రితం మా తండ్రిగారు స్థాపించారు. ఈ ప్రాంతంలో ఉన్న బీద విద్యార్థుల సహాయార్థం ఆ సొమ్ము వినియోగిస్తూంటారు. మా కుటుంబ పరిస్థితి తెలిసిన వారవడంవల్ల, మాయందు అభిమానంఉన్న వారవడం వల్ల ఆ సంస్థ కార్యకర్తలు మా నాన్నగారు సన్యసించింది మొదలు మా కష్టసుఖాలను కనుక్కుంటూ నా చదువుకు సాయం చేస్తున్నారు కొంత."

"ఇకముందు నీ చదువుకి ఆ సంస్థద్వారా మీ తండ్రి ప్రత్యేకమైన సహాయం చెయ్యవచ్చును కదా?"

"అటువంటి దెన్నడూ జరగడానికి ఆస్కారం లేదండి. ఇంతవరకు జరిగిన సహాయానికి కూడా మా తండ్రిగారి ప్రమేయం ఎంతమాత్రం లేదు. ఇకముందు ఉండబోదు. ఆయన సన్యాసాశ్రమం స్వీకరించింది మొదలు ఈనాటివరకు నన్ను గురించి గాని, మా అమ్మ గురించిగాని తలవనైనా లేదు. ఐహిక విషయాల కాయన అతీతుడైనాడు."

"నీమాట మాకేం నమ్మకం? నీకాతడు

అనన్య సామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక

*1965, నవంబరు 1 నుంచి*

కొత్త ప్రకటన రేట్లు

| | | | |
|---|---|---|---|
| కాజువల్ | : | కాలం సెం. మీ. 1 కి | 7—50 |
| కంట్రాక్టు | : | కాలం సెం. మీ. 1 కి | రు. 6—80 |

(250 సెం. మీ. లు, ఆపైన)
(ప్రకటనకు కనీస స్థలం సిం. కాలం—5 సెం. మీ. లు)

అట్ట పేజీలు

4 వ పేజీ-రెండు రంగులు

| | | | |
|---|---|---|---|
| కాజువల్ | : | ప్రకటన 1 కి | రు. 1100/— |
| కంట్రాక్టు | : | ప్రకటన 1 కి | రు. 950/— |

(కనీసం 6 ప్రకటనలు)

2 వ పేజీ, 3 వ పేజీ—ఒక రంగు

| | | | |
|---|---|---|---|
| కాజువల్ | : | ప్రకటన 1 కి | రు. 700/— |
| కంట్రాకు | : | ప్రకటన 1 కి | రు. 600/— |

(కనీసం 6 ప్రకటనలు)

కొలతలు:

కాలం వెడల్పు 5 సెం. మీ.
కాలం నిడివి 23 సెం. మీ.
పేజీకి 3 కాలంలు

*ఇతర వివరములకు దిగువవారికి వ్రాయండి:*

అడ్వర్టయిజ్‌మెంట్ మానేజర్,
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు-2

## మరలిరాని మమత

తండ్రి అనీ, అతనివల్ల ఏవిధమైన సహాయం నీకు జరగదనీ ఉత్తరం వ్రాయించి తీసుకుని వస్తే ఈ స్కాలర్‌షిప్ ఇస్తాం" అన్నారు అధికారులు.

చేసేదిలేక, "సరే" అన్నాడు ఆ విద్యార్థి.

తల వంచుకుని బయటకు వచ్చేశాడు.

తనకోసం ఎదురు చూస్తున్న తల్లి రాజేశ్వరితో ఇంటర్వ్యూలో జరిగిన విషయం అంతా చెప్పాడు ఆ అబ్బాయి.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

కొంతసేపు ఆ తల్లీబిడ్డల మధ్య మౌనం రాజ్యం చేసింది.

ఎవరి ఆలోచనలలో వారు ఉన్నారు.

అబ్బాయే ప్రారంభించాడు మాట్లాడడం.

"వాళ్ళు ఆమాట అనేసరికి స్కాలర్‌షిప్‌కి నీళ్ళు వదులుకున్నాను, ఇక లాభం లేదని. అయితే పైకి అలా అంటే మర్యాద కాదని 'సరే, అలాగే తెస్తాను' అని చెప్పి వచ్చాను" అన్నాడు.

"మనం ఈ విధంగా బ్రతకడం కూడా ఆ భగవంతునికి ఇష్టంలేదు కాబోలు! అందరికీ తెలిసిన నిజాన్నయినా ఒక్కొక్కప్పుడు నమ్మించలేం. ఇంతకీ ఎవరినీ అనవలసిన పనిలేదు. మన రోజు లటువంటివి." కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది తల్లి.

"మా ప్రిన్సిపాల్‌గారుకూడా మన కుటుంబ పరిస్థితుల గురించి చెప్పారు. అయినా 'ఎవరి డ్యూటీలో వారు అప్రమత్తంగా ఉండాలి కదా? ఇటువంటి సందర్భంలో కొన్ని చిక్కులను వారెదుర్కోవలసి వచ్చిందట. ఉత్తరం తెచ్చుకుంటే కాని ఇవ్వం. తేడావస్తే మా పీకమీదకు వస్తుంది. ఏ లంచమో పుచ్చుకున్నామనో లేకపోతే బంధుత్వంవల్ల చేశామనో మాట వస్తుంది' అని ప్రిన్సిపాల్‌గారితో వారంటూంటే విన్నానమ్మా" అన్నాడు ఆ పిల్లవాడు.

"ఆ మాట నిజమే. ఎవరి బాధలు వారివి. మనం ఎంతసేపు ఇలా అనుకుంటూ కూర్చున్నా లాభం లేదు. ఏది ఎలా జరగాలని ఆ విధి వ్రాశాడో అది అక్షరాలా జరిగి తీరుతుంది. ప్రయత్నలోపంమాత్రం జరగకూడదు" అంటూ రాజేశ్వరి లేచింది.

"అదేమిటమ్మా, నాన్నగారి దగ్గరకు వెడతావా! ఆయన మన విషయం వినరు. ఆఖరికి పలకరించనైనా పలకరించరు. ఎందుకమ్మా శ్రమ? ఇన్నాళ్ళా ఏ స్కాలర్‌షిప్ ఉందని చదివాను? ఈ చదువూ అలాగే సాగిపోతుంది. నువ్వు బాధపడకు" అని వారించబోయాడు.

కాని, రాజేశ్వరి ఆగలేదు.

"మన ప్రయత్నలోపం ఎప్పుడూ ఉండకూడదు. అప్పుడు ఆ దైవంమీద భారంవేసి వేచి ఉందాం" అంటూ ఆ ఊరి బయట ఉన్న ఆనందమఠం వైపు బయలుదేరింది రాజేశ్వరి.

**సర్వసంగ పరిత్యాగం చేయడం ఎంతో సుకరం. ముక్కు మూసుకొని ఒక మూలకూర్చుని తపసులో మునిగి పోవడం ఎంత సుఖం! సంసార సాగర సముత్తరణానికి సాధనం కనుపించని వారి ఊహలు ఇలా ఉంటాయి. ఏమైనా సన్న్యాసికి సంసారం అంటే మాత్రం నమ్మిక కుదరదు.**

పశ్చిమదిశ అరుణారుణ కాంతులతో చూడ ముచ్చటగా ఉంది. పగలల్లా చేసిన నిరంతర ప్రయాణంవల్ల అలసిన తపనుడు అమ్మ ఒడిలోకి పరుగు తీశాడు. గూళ్ళకు చేరే పక్షుల కిలకిలా రావాలు వీనులకెంతో ఇంపుగా ఉన్నాయి. అప్పుడే చల్లగాలి తిరిగింది. ప్రాణుల కెంతో హాయి నిస్తూంది. పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తూ ఆడుకుంటున్నారు.

బజారుకనీ, సినిమాలకనీ, షికార్లకనీ వచ్చే పోయే జనంతో రోడ్డు రద్దీగా ఉంది.

రాజేశ్వరి ఇవేమీ గమనించడం లేదు.

తల వంచుకుని మైలు దూరంలో ఉన్న తన గమ్యస్థానాన్ని చేరుకుందుకు త్వరపడు తూంది.

అయితే ఆమె అడుగులు గబగబా పడ్డంలేదు.

ఏవేవో ఆలోచనలు ఆమె మనోవీధి నాక్రమించాయి.

ఆమె చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. అనాథ శిశురక్షణ కేంద్రంలో తనవంటి అభాగ్యులు ఇంచుమించు తన వయసువారితో కలిసి పెరిగి హైస్కూలు చదువు పూర్తిచేసింది.

సత్యానందం బి. ఎ. పాసయినాడు. స్ఫుర ద్రూపి. దయార్ద్ర హృదయుడు. సంఘ సంస్కారం అంటే ఆసక్తి కలవాడు. పేదవారికీ, ఆపదలో ఉన్నవారికీ సహాయపడ్డమే తన జీవిత పరమావధిగా భావించేవాడు.

అతనెప్పుడూ నవ్వుతూ ఉండేవాడు.

"నువ్వుసత్యానందానివి కావు, నిత్యానందానివి" అనేవారు అతని మిత్రులు.

అతని ఉదార గుణానికి అంతా సంతోషించే వారు. దిక్కూ మొక్కూ లేని రాజేశ్వరిని వివాహం చేసుకుందుకు కారణమైంది ఆ ఉదారగుణమే.

ఏడాదినాటికి ఆ దంపతులకు పండంటి ఓ అబ్బాయి పుట్టాడు.

సత్యానందం కొంతమంది యువకులను చేర్చి ఓ సంఘం స్థాపించాడు. నిధి వసూలు చేశాడు. అంగవికలులకు, పేదవారికి, దిక్కులేని ముసలి వారికి ఆశ్రయం కల్పించాడు. ఎవరు చేయగలిగిన పని వారు చేస్తారు ఆ చేరినవారిలో.

వారం వారం సభలు ఏర్పాటు చేశాడు సత్యానందం. పెద్దవారిచేత ఉపన్యాసాలిప్పించేవాడు. పురాణ పఠనం కూడా ఏర్పాటు చేశాడు. పేద పిల్లలకు పాఠశాల ఏర్పాటు చేశాడు. పై పాఠశాలలలో చదివే పేద విద్యార్థులకు అవసరమైన సహాయం లభిస్తూండేది ఈ సంస్థవల్ల.

రామకృష్ణ మిషన్ ఏవిధంగా పనిచేస్తుందో ఆ పద్ధతులను తమ సంఘంలో ఏర్పాటుచేశాడు.

"ఇలా తిరుగుతూ ఉంటే మీ ఆరోగ్యం పాడవుతుంది. ఒళ్ళు చూసుకోకపోతే ఎలాగ?" అంది రాజేశ్వరి ఒకనాడు.

"తన కాయుష్యం, తన కారోగ్యం అంటూ కూర్చుంటే మన చుట్టుపట్ల ఉన్న అభాగ్యుల గతి ఏంకావాలి? 'ఇంటింటికొక పుణ్య ఈశ్వరుడి కొకమాల' అన్నట్టు అంతా తలొక చెయ్యీ వేస్తే ప్రజలకు ఉపయోగకరమైన పనులెన్నో సాధించ వచ్చు. ఈ అనాథలకు రోగం వస్తే చూసే వాళ్లెవరో చెప్పు. అటువంటివారికోసం వైద్యకేంద్రం స్థాపిస్తున్నాం కొత్తగా. నువ్వూ నాతోపాటు నడుం కట్టుకుని సంఘ సేవకు పూను కునే రోజుకోసం ఎదురు చూస్తున్నాను" అన్నాడు సత్యానందం.

"మీకా ఉద్దేశ్యమే ఉంటే ఈ క్షణంనుండి మీరు చేసే సంఘ సేవలో నేనూ పాల్గొంటాను" అంది ఆమె.

ఎంతో ఆనందించాడు సత్యానందం, ఆమె సహకారానికి. ఆనాడే కాదు, వివాహమైనది మొదలు ఏనాడూ అతనికి అనుకూలంగా మసులు కునేది ఆమె. ఎన్నడూ అతనికి ఎదురుచెప్పిఎరగదు. అన్యోన్య దాంపత్యం వారిది. సహధర్మచారిణి అన్న పదం సార్థకం చేసుకుందామె.

అతని సంస్థలో మహిళాశాఖ ఆమె నిర్వహిస్తూంది.

అయితే ఆ సేవలో ఆ దంపతులు అంతకంతకు దూరమవుతున్నారు. శాఖోపశాఖలుగా పెరిగి పోతూంది ఆ సంస్థ. కొత్త కొత్త బాధ్యతలతో, ఊహలతో, పనులతో నిమిషం తీరికలేదు సత్యానందానికి.

అతడు లోకోపకారంకోసం తంటాలు పడుతున్నాడు. ఎన్నో గొప్ప పనులు సాధిస్తున్నాడు. జీవనాధారం లేనివారికెందరికో బ్రతుకుతెరువు చూపించాడు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేస్తున్నాడు. అజ్ఞానులను విజ్ఞానవంతులుగా చేయడానికి సర్వశక్తులూ ధారపోస్తున్నాడు.

ఈనాడు కొన్ని వేలమంది అతని పేరు చెప్పుకుని బ్రతుకుతున్నారు.

కాని, తనకూ, తన భర్తకూ మధ్య చాలా దూరం ఉన్నట్లుగా ఆమె బాధ పడుతూంది.

ఈవిధమైన ఆలోచనలతో ఉన్న రాజేశ్వరి ఓనాడు భర్త రాకను గమనించలేదు.

"ఏమిటి, రాజ్యం, ఆ దీర్ఘాలోచన?" అన్నాడు సత్యానందం.

అతని రాకను ఆమె గమనించనే లేదు.

ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

అతడు చకితుడైనాడు.

"మీరు చేసే మానవసేవ గురించి ఆలోచిస్తున్నాను. ఆ సేవలో నన్నూ, నా బిడ్డనీ మరిచిపోతారేమోనని భయం వేస్తూంటుందొక్కొక్కప్పుడు" అంది.

## వేదుల మీనాక్షీదేవి

ఆమె కంఠంలోని రుద్ధతను అతడు గ్రహించక పోలేదు.

"ఏవేవో ఊహలతో నీమనస్సు కలత పరుచుకుంటున్నావు కాని అలాంటిదానికి ఆస్కారంలేదు. మనస్సు దుర్బలమైతే మనిషి దుర్బలమవుతాడు. మనిషి దుర్బలమైననాడు సంఘం, తద్వారా దేశం బలహీనం కాక తప్పదు. మానవుడెన్నడూ చిత్త స్థైర్యాన్ని కోల్పోరాదు" అన్నాడు సత్యానందం.

సంస్థతోపాటు బాధ్యత వహించే శిష్యుల సంఖ్య బాగా పెరిగిపోయింది. అందువల్ల కొన్ని బాధ్యతలను వారి కప్పగించాడు. కాస్త విశ్రాంతి దొరికింది అతనికి.

ఉన్నట్టుండి హఠాత్తుగా ఎక్కడికో వెళ్ళిపోయాడు సత్యానందం! ఎవ్వరితోనూ చెప్పలేదు!

అతను ఎక్కడకు వెళ్ళినదీ ఎవరికీ తెలియక పోవడంతో రాజేశ్వరి గాభరా పడిపోయింది.

ఆయన రాకకోసం వేయి దేవుళ్ళకు మొక్కుకుంటూంది.

ఆరుమాసాలు గడిచాయి ఆవిధంగా.

"సత్యానందం వచ్చాడు. సన్యాసం పుచ్చుకున్నాడు" అన్న వార్త ఓనాడు తెల్లవారేసరికి ఊరంతా ప్రాకింది.

ఎవరినోట విన్నా ఆమాటే.

"ఇదేం దుర్బుద్ధి?" అనుకుంటూ జనం అంతా ఆయన స్థాపించిన ఆశ్రమం దగ్గర పోగయారు.

రాజేశ్వరి భోరున ఏడుస్తూ ఆయన పాదాలపై బడింది.

కాషాయాంబరాలలో నివురుగప్పిన నిప్పులాగ ఉన్నాడు సత్యానందం. ముఖంలో ఒక వింత కాంతి, కళ్ళలో ప్రసన్నత గోచరిస్తున్నాయి.

అలనాడు మానవుని బాధలనుండి విముక్తి కలిగించే మార్గాన్ని తెలుసుకునేందుకు భార్య యశోధరను, కొడుకు రాహులుని, రాజ్యాన్ని, తల్లిదండ్రులను విడిచి సన్యసించిన బుద్ధభగవానుడు జ్ఞాపకం వచ్చాడు.

అదే వయస్సు. అదే పరిస్థితి.

ఆతనితో కొందరు వృద్ధ సన్యాసులున్నారు. వారాతన్నభినందిస్తున్నారు.

తన పాదాల వద్ద గుండెలు బద్దలయేలాగ దుఃఖిస్తూంది రాజేశ్వరి.

సత్యానందం ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించలేదు. సరికదా, పలకరించనైనా లేదు.

మౌనంగా ఊరుకున్నాడు.

అక్కడ చేరిన వారంతా ఆమెను చూసి కంట తడిపెట్టుకున్నారు. అతను సన్యసించాడన్న వార్త వారిని చకితుల్ని చేసిందంటే కట్టుకున్న ఇల్లాలి

మాట చెప్పాలా?

"ఇంత తెగింపు ఎందుకు కలిగింది? నేనెన్నడైనా మీమాట జవదాటానా? పుట్టింది మొదలు 'నా' అన్నవారు లేకుండా బ్రతికాను. మీ ఆశ్రయం లభించింది. ఇక జీవితం సాఫీగా గడిచి పోతుంది; నా బాధలు తీరాయని ఆనందించాను. నేను ఆనందంగా ఉండడం ఆ దైవానికిష్టంలేదు కాబోలు. నేనేం తప్పు చేశానని ఈ శిక్ష విధించాడో?" అంటూ దుఃఖిస్తోంది రాజేశ్వరి.

మొట్టమొదటి సారిగా నోరు విప్పాడు సత్యానందం.

"పిచ్చిదానా! దేవుడేం చేశాడు? జీవులు చేసుకున్న సుకృత దుష్కృతాలను బట్టి ఆయా సుఖాలూ, కష్టాలూ కలుగుతూంటాయి. చేసుకున్న కర్మ అనుభవించడం దేవతలకు కూడా తప్పలేదంటే కేవలం మానవ మాత్రులం మనమనగా ఎంత? ఏ పరిస్థితిలోనూ దైవనింద చెయ్యకూడదు" అన్నాడు సత్యానందం.

"ఈ జన్మలో నేనే పాపం చెయ్యలేదు. ఇక ఏ జన్మ కర్మో అంటే అది అర్థంలేని మాట. ఇహాన్ని ఇహాన్నే అనుభవిస్తారంటారు. అలా జరగడం లేదు. ఏ జన్మలో చేసిన పుణ్య పాపాలకు ఆ జన్మలోనే మంచి చెడ్డలు జరగాలి. అప్పుడు దేనివల్ల చెడ్డ కలుగుతుందో తెలుస్తుంది. అలా కాకుండా తప్పు చేసినప్పుడు శిక్షించక మరో జన్మలో ఏ పాపమెరుగనప్పుడు శిక్షా! వెనకటి జన్మ తాలూకు కర్మ అంటూ ఏవేవో బాధలు, దుఃఖాలు వారి నెత్తిన పిడుగులాగ పడెయ్యడం ఏం ధర్మం? ఇదేనా దేవుని న్యాయం? దైవం తీర్పే అలాగ ఉన్నప్పుడు మనుష్యుల న్యాయా

# మరలిరాని మమత

న్యాయ విచక్షణ ఇక నెలాగ ఉంటుందో ఊహించనైనా ఊహించనక్కర్లేదు."

ఉద్రేకంతో అంది ఆమె.

"ఈనాడు నువ్వు లేదంటే పోయేదికాదు. జన్మ జన్మల కర్మ వెంట వస్తుంటే ఆ దైవం మాత్రం ఏం చేయగలడు? మనం తప్పు చెయ్యడం, ఆ దైవాన్ని నిందించడమూనా? ఏమి సబబు అది?

"కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలు అంతశ్శత్రువులు. అవి మనలోనే ఉంటూ తమ ప్రభావంతో మనలో ఉన్న మంచిని బయటికి రానివ్వకుండా శతధా ప్రయత్నిస్తూంటాయి. ఆ అంతశ్శత్రువులను జయించాలి. ఇంద్రియాలను స్వాధీనం చేసుకోవాలి. అప్పుడు మన మనస్సు మన అధీనంలో ఉంటుంది. సాత్వికత అలవడుతుంది. అప్పుడు ఆ మనస్సును దైవాయత్తం చేయడానికి ధ్యానం ప్రారంభించాలి. అదే మనస్సుకి శాంతిని, ఆనందాన్ని, తృప్తిని ఇస్తుంది. అదే సమస్తమైన బాధలనుండి జీవులను విముక్తులను చేసేది."

వేదాంతబోధ ప్రారంభించాడు సత్యానందం.

తననూ, తన బిడ్డనూ చూస్తే అతని హృదయంలో ఎంతో కొంత పరివర్తన రాకమానదనుకుందామె. పోనీ, తనమాట ఎలా ఉన్నా పిల్లవానిపైగల ప్రేమానుబంధం వల్లనైనా కొంత వైరాగ్యం సడలి తీరుతుందని ఆశించింది.

ఆమె ఆశలు అడియాసలైనాయి.

పిల్లవానిని కన్నెత్తి చూడనైనాలేదు!

పైగా వేదాంతబోధ చేస్తున్నాడు!

కట్టుకున్న భర్త దూరమవుతున్నప్పుడిక తనదొక బ్రతుకా?

ప్రపంచంలో తనూ, అభమూ శుభమూ తెలియని ఆ బిడ్డా దిక్కులేని పక్షుల్లాగ మిగిలిపోవాలా? తనేమైనా ఫరవాలేదు. తన జీవితం గురించి ఆలోచనలేదు. ఈ పిల్లవాని గురించే బాధ. వాని బాధ్యత తనపై బడింది. వీడిని పెంచాలి. విద్యాబుద్ధులు చెప్పించాలి. ప్రయోజకుణ్ని చెయ్యాలి.

ఇది తనకు సాధ్యమా?

సాధ్యం కాకపోతే?

ఏమిటి దారి?

అంతా అయోమయంగా, అంధకారంగా, సర్వం శూన్యంగా అనిపించిందామెకు.

ఒక దీర్ఘ నిశ్వాసం విడిచింది.

తన భర్తవైపు చూసింది.

"ఇవేనా మీరు చెప్పవలసిన మాటలు? రాతి గుండెలుగల విగ్రహాలు కాదు మనం. మానవులం. మనకి హృదయమనేది ఉంది. మీరు ముక్కుమూసుకుని కూర్చుని పుణ్యం సంపాదిద్దామనుకుంటున్నారే గాని మీమీద ఆధారపడ్డ రెండు జీవాలు మీ పుణ్యార్జన కారణంగా బలి అయి పోతున్నాయన్న విషయం మీరు ఆలోచించడం లేదు. ఇందువల్ల మీకు పుణ్యానికి బదులు పాపం రాదా? ఈ కర్మ జన్మజన్మలకు వెంటరాదా? మీరు చెప్పిన కర్మ సిద్ధాంతం అదేకదూ? ఆ విషయమైనా ఆలోచించుకున్నారా?" అని అడిగింది ఆమె.

చుట్టూ చేరిన జనం నిశ్శబ్దంగా ఆమెమాటలు వింటున్నారు.

ఆతను ఏమి చెబుతాడో అని వారూ ఎదురు చూస్తున్నారు.

"నేను కర్మ అనుభవించవలసి వస్తే రావచ్చు. నేను అన్నిటికీ అతీతుడనని అర్థంలేదే? ఈ జీవితం క్షణభంగురం. ఏ నిమిషాన కన్నుమూస్తామో తెలియదు. అశాశ్వతమైన ఈ అల్పజీవితం కోసం శాశ్వతమైన ఆముష్మికానికి దూరమై పాపాలుచేస్తూ, పుడుతూ, చస్తూ శాశ్వతంగా పతనావస్థ పొందడం మంచిదా? రౌరవాది నరకాలు అనుభవించవలసినదేనా?

"ప్రవాహంలో రెండు దుంగలు కొట్టుకువచ్చి ఓచోట చేరతాయి. మరొకమారు కెరటాల తాకిడికి విడిపోయి మరొకచోటుకు పోతూటాయి. జీవులూ అంతే."

ప్రశాంతంగా అన్నాడు సత్యానందం.

"ఇక మీ మనస్సు మారదా? ముక్కుపచ్చలారని ఈ బిడ్డని చూడండి" అంటూ వెక్కివెక్కి ఏడిచింది రాజేశ్వరి.

"చూసేవాళ్లెవరు? చూడబడేవారెవరు? అంతా ఆ దైవ సంకల్పం." నిర్వికారంగా అన్నాడు సత్యానందం.

ఏడుస్తున్న తల్లిని చూడగానే పిల్లవానికీ దుఃఖం ఆగలేదు.

ఏటి ఒడ్డున

చిత్రం— కొలను వెంకటదుర్గాప్రసాద్ (విజయవాడ-4)



తండ్రి దగ్గరగా వెళ్ళి, "నాన్నా, ఇంటికి రావా?" అన్నాడు.

సత్యానందం ముఖం గంభీరమై పోయింది.

"నీ తండ్రి ఎక్కడ? అతడు చచ్చిపోయాడు. నేను చిన్మయానందస్వామిని" అన్నాడు.

త్రుళ్ళిపడింది రాజేశ్వరి.

"ఆ మాట అనకండి. ఎక్కడో అక్కడ, ఎలాగో అలాగ మీరు బ్రతికి బాగుండండి. అంతే చాలు" అంటూ రాజేశ్వరి కళ్ళ నీళ్ళు తుడుచుకొంది. ఓర్పును అక్కున చేర్చుకుంది.

"నారాయణా" అంటూ స్వామి తేవాడు ధ్యానానికి.

ప్రమాదవశాత్తు తన జీవితానికి ఆ ఓర్పే జీవంగా భావించిందామె. చిన్న ఉద్యోగం సంపాదించింది. అష్టకష్టాలూ పడి పిల్లవాడిని స్కూలూ, స్కూలుఫైనల్ దాకా చదివించింది. కాస్త కూస్తో ఇదివరకు సహాయపడిన వారు ఉన్నారు. ఇంక ఎన్నాళ్ళని తను తంటాలు పడగలదు? కాలేజి చదువుకు సహాయం లభిస్తే చదివించాలనే ఉంది. చదివించినా తప్పదు. పూర్తిగా కాకపోయినా, ఏదో ఒక డిగ్రీ అయినా చేతికి వచ్చేటట్టు చేయాలి. చిన్న చదువు వల్ల ఏం సంపాదించి బ్రతుకు వెళ్ళదీయగలడు? ఎలాగో లాగి బండిని. తప్పదు.

తన జీవితమంతా ఆమె కళ్ళ ముందు సినిమా రీలు లాగ గిర్రున తిరిగి పోతూంది.

"తప్పుకోవమ్మా— కారు వస్తోంది. అటు కారు, ఇటు కారు. మధ్య చచ్చిపోగలవ్" అన్న ఓ రిక్షావాలా కేకలో గత స్మృతులతో సతమతమవుతున్న రాజేశ్వరికి తనెక్కడ ఉన్నదీ గుర్తుకు వచ్చింది.

'చచ్చిపోతే బాగానే ఉండును. ఆ మృత్యుదేవతకి మాత్రం నామీద దయా?'

తనలో తనే పిచ్చిగా అనుకుంటూ వెర్రిగా నడుస్తూందామె.

సంధ్య వెళ్ళింపల్ల చీకటి పడిన సంగతి అంతగా తెలియడం లేదు.

అగ్నిబాధితులకు, వరదబాధితులకు, ఒక రేమిటి ఆపదలో ఉన్న అందరికీ అడ్డుపడ్డమే జీవిత పరమావధిగా పెట్టుకున్న చిన్మయానంద స్వామి కుష్ఠురోగ నివారణ కేంద్రానికి వెళ్ళి అప్పుడే మఠానికి చేరుకున్నాడు. స్నానం చేసి ధ్యానానికి కూర్చోబోతూ పాదాలమ్మీద పడిన తలెత్తి చూశాడు స్వామి.

రాజేశ్వరి భక్తితో పాదాలకు మ్రొక్కింది.

స్వామి బాగా కృశించిపోయాడు. ఎండా, కొండా అనకుండా తిరిగి తిరిగి నగమయాడు. పదహారువన్నె బంగారుచాయ ఏమైంది? బాగా నల్లబడ్డాడు.

ఆమె కన్నీళ్ళు ఆమె హృదయంలోని వ్యథను వ్యక్తం చేస్తున్నాయి. మానవసేవే మాధవసేవ అంటారు. ఈయన అటు మానవసేవ, ఇటు మాధవసేవ కూడా చేస్తున్నాడు!



సుఖమెరగని నిద్ర

చిత్రం — ఎస్. మోహనకృష్ణ (బాపు)

మనిషి కృశించినా ముఖంలోని ఆ వర్చస్సూ, ప్రశాంతతా మాత్రం ద్విగుణీకృతంగా ఉన్నాయి అనుకుంది.

ఏమి పని? అన్నట్టు చూశాడు స్వామి.

విషయం చెప్పిందామె.

ఉత్తరం వ్రాసి ఇవ్వడానికి ఆయన అంగీకరించలేదు.

"మీరీ ఆశ్రమంలో ప్రవేశించి తొమ్మిదేళ్ళయింది. పిల్లవానికి రాని జబ్బు అంటూ లేదు. ఆసుపత్రులలో వాడితో పడనిపాట్లు లేవు. ఎలాగో తంటాలు పడి ఇంతవరకు తీసుకుని వచ్చాను. ఇక పిల్లవాడికి చదువుకునేందుకు ఏవిధమైన ఆస్కారం కనబడడంలేదు. ఈ స్కాలర్‌షిప్ గనక వస్తే వాడు వృద్ధిలోకి రావడానికి వీలవుతుంది. ఇప్పుడైనా మిమ్మల్ని ఇబ్బంది పెట్టక పోదును. ఆ కమిటీ మెంబర్లు పైవాళ్ళు అవడం వల్ల ఈ విధంగా ఒత్తిడి చేశారు. ఈ సహాయం ఒక్కటీ మీ బిడ్డకు చేయండి. మాట మాత్రం సాయం చెయ్యమంటున్నాను. పిల్లవాని అభివృద్ధికి ఆటంకం కలిగించకండి. వాడికి రెక్కలు వస్తే నేను మీ మఠంలో సేవకురాలిగా మిగిలిన పని నా కాలం వెళ్ళదీసుకుంటాను." ప్రార్థనాపూర్వకంగా అంది రాజేశ్వరి కన్నీటితో.

స్వామి ముఖాన చిన్న నవ్వు చూసిందామె.

పవిత్రమైన, నిర్మలమైన దరహాసం అది.

"జీవితం అంటే పూలబాట కాదు. అనేకమైన ముళ్ళదారులతో, అనుక్షణం భయంకరమైనది, ప్రమాదభూయిష్టమైనది. అన్నీ ఒడిదుడుకులకు తట్టుకోవాలి. వాటి కన్నీటికి అతీతులమై పోవాలి. ఎందరో పేద విద్యార్థులకు మా సంస్థ సొమ్ము ఖర్చు చేయడం జరుగుతూ ఉంది. ఆ సొమ్ము అనుభవించడానికి అందరితో పాటు నీ కుమారునికీ హక్కు ఉంది. అంతకన్న నేనేం చెయ్యలేను. నేను ఉత్తరం వ్రాసినట్లయితే 'ఈ పిల్లవాని తండ్రిని నేను. ఈ లోకంలోని విషయాలతో సంబంధం విడనాడుకున్నాను. నాకేమీ వీరితో ప్రమేయం లేదు' అని కదా వ్రాయమన్నారు? అవిధంగా వ్రాసినట్లయితే పూర్వాశ్రమాన్ని జ్ఞప్తికితెచ్చినట్లవుతుంది. అలా నేను చేయరాదు. ఇది గురువాజ్ఞ. ఇక వెళ్ళవచ్చును" అన్నాడు స్వామి ధ్యానంలోకూర్చుంటూ.

చేసేదిలేక ఆమె ఇంటిముఖం పట్టింది. ముఖాన కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు. కాళ్ళు తడబడుతున్నాయి.

ఘటాన్నిలాగో ఇంటికి చేరవేసింది.

"నాన్న ఏమన్నారమ్మా? ఉత్తరం ఇచ్చారా?" అంటూ ఎదురు వచ్చాడు కొడుకు.

గుమ్మంలో అడుగు పెట్టబోతూ తూలిపడిపోయింది రాజేశ్వరి.

కొయ్యబారిన తల్లిని చూసి కెవ్వుమని కేక వేశాడు. నలుగురూ వచ్చారు. ముఖాన నీళ్ళు జల్లారు.

"ప్రాణం కడుంటే పోయింది, పాపం!" అన్నారు అక్కడ చేరినవారిలో ఒకరు.

"ఆ ఇల్లాలికి ఒక్కనాడు సుఖం లేదు. కష్టజీవి."

ఎవరికి తోచినట్లు వారు ఆమె గురించి సానుభూతి వాక్యాలు పలుకుతున్నారు.

కొంతసేపటికి ఆమె మెల్లిగా కళ్ళు తెరిచింది.

ఎదురుగా ఏడుస్తున్న కొడుకును చూసింది.

"అమ్మా!" అన్నాడు అబ్బాయి ఆదుర్దాగా.

"నాయనా, నాకు నువ్వు, నీకు నేను ఉన్నాం. మనకెవ్వరూ దిక్కులేరు. ఆ దైవంకూడా మన పట్ల శత్రుత్వమే వహించాడు. ఇలారా, నాయనా" అంటూ కొడుకును కౌగిలించుకొని రోదించింది.

ఆమె కన్నీళ్ళు కాల్వలే అయినాయి.

అది చిన్నవూరు అవడం వల్ల ఏ విషయం అయినా క్షణంలో ఊరంతా వ్యాపిస్తుంది. సత్యానందం విషయం కూడా అలాగే వ్యాపించి స్కాలర్‌షిప్ కమిటీ వారిదాకా తెలిసింది.

ఆ కమిటీవారు రాజేశ్వరి పిల్లవానికి స్కాలర్‌షిప్ మంజూరు చేశారు, తమ సానుభూతికి తార్కాణంగా. ★